జ్వాల
# దశ
నిజం.. నిర్భయంగా..

WWW. DASHANEWS .COM
మంగళవారం
10 02 2026
సంపుటి 1 సంచిక 80
పేజీలు : 04
PRGI No : TGTEL/25/A4195



దశ పత్రికలో పనిచేసేందుకు జీహెచ్ఎంసీ పరిధిలో రిపోర్టర్లు కావలెను. సీనియర్ రిపోర్టర్లకు తగిన పారితోషికం ఇవ్వబడును.

7337 54 6647
9848 28 8850


# ముక్కోణపు భాగ్యనగరం



## నేడు జీహెచ్ఎంసీ విభజన..?

### జీహెచ్ఎంసీ, జీసీఎంసీ, జీఎంఎంసీలుగా ఏర్పాటు..?

### ఇవాళ్టితో ముగుస్తున్న జీహెచ్ఎంసీ పాలకమండలి గడువు

## 17 ఏళ్ల తర్వాత ప్రత్యేక అధికారి పాలన

**దశ, హైదరాబాద్ :** 300 డివిజన్లతో దేశంలోనే అతి పెద్ద మహానగరంగా విస్తరించిన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ)ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి 10వ తేదీన మూడు కార్పొరేషన్లుగా విభజించనుంది. ఈ నేపథ్యంలోనే ఆయా కార్పొరేషన్లు ఏ విధంగా ఏర్పాటు కానున్నాయి? వాటి పేర్లు ఏంటి? ఎంత జనాభాతో ఏర్పాటు కాబోతున్నాయనే ప్రశ్నలు హైదరాబాద్ నగరవాసుల్లో తీవ్ర ఉత్కంఠను రేకెత్తిస్తున్నాయి. అదే సమయంలో ప్రస్తుత కార్పొరేటర్ల పదవీకాలం పూర్తవనుండటంతో తర్వాత నగర పాలన ఏ విధంగా ఉండనుందనేటువంటి చర్చ ప్రస్తుతం జరుగుతోంది.

**17 ఏళ్ల తర్వాత ప్రత్యేక అధికారి పాలన**

భాగ్యనగరంలో 17 ఏళ్ల తర్వాత స్పెషల్ ఆఫీసర్ పాలన రాబోతుంది. పాలకమండలి లేనప్పుడు మేయర్‌కు సమాన హోదాలో రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు ప్రత్యేక అధికారులను నియమించి పరిపాలనను నిర్వర్తిస్తుంది. చివరి సారిగా 2008 సెప్టెంబరు 4వ తేదీ నుంచి 2009 డిసెంబరు 4వ తేదీ వరకు ఎస్.పి.సింగ్ కమిషనర్, ప్రత్యేక అధికారి హోదాలో జీహెచ్ఎంసీ పరిపాలన బాధ్యతలను చేపట్టారు. ఆయనకు ముందు అంటే 12 మున్సిపాలిటీలను హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేసి జీహెచ్ఎంసీని ఏర్పాటు చేసినప్పుడు గ్రేటర్ హైదరాబాద్ మొట్టమొదటి కమిషనర్, స్పెషల్ ఆఫీసర్గా సి.వి.ఎస్.కె.శర్మ నియామకం అయ్యారు. ఆయన 2007 ఏప్రిల్ 16వ తేదీ నుంచి 2008 సెప్టెంబరు 4వ తేదీ వరకు పని చేశారు.పాత జీహెచ్ఎంసీలో

..మిగతా 4వ పేజీలో →


**జీహెచ్ఎంసీ కార్పొరేషన్**
శంషాబాద్, రాజేంద్రనగర్, చార్మినార్, ఖైరతాబాద్, గోల్కొండ, సికింద్రాబాద్

**మల్కాజిగిరి కార్పొరేషన్ (ఎంఎంసీ)**
మల్కాజిగిరి, ఎల్బీనగర్, ఉప్పల్

**సైబరాబాద్ కార్పొరేషన్ (సీఎంసీ)**
కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్

## మున్సిపల్స్‌కు అంతా సిద్ధం

**దశ, హైదరాబాద్:** రాష్ట్రంలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా, పోలింగ్ జరిగే రోజైన ఫిబ్రవరి 11న ఓటర్లు తమ ఓటు హక్కును ఎటువంటి ఆటంకం లేకుండా వినియోగించుకోవడానికి వీలుగా ఆయా ప్రాంతాల్లో స్థానిక సెలవు ప్రకటించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించింది.పోలింగ్ జరిగే మున్సిపల్ పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, సహకార



సంఘాలు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలకు సెలవు వర్తిస్తుంది. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు (కరీంనగర్, రామగుండం, నిజామాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, కొత్తగూడెం, నల్గొండ) కలిపి మొత్తం 123 పట్టణ స్థానిక సంస్థలలో 2,996 వార్డులకు ప్రతినిధులను ఎన్నుకోనున్నారు.ఎన్నికల నిబంధనల ప్రకారం, పోలింగ్ ప్రారంభమయ్యే 48 గంటల ముందు ప్రచారం ముగుస్తుంది. ఫిబ్రవరి 11న ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది కనుక, ఫిబ్రవరి 9వ తేదీన

..మిగతా 4వ పేజీలో →

## అంగన్‌వాడీలకు సర్పంచ్‌లే బాస్‌లు

### గ్రామ పాలనలో కొత్త మార్పు

**దశ, హైదరాబాద్:** గ్రామ పంచాయతీల సర్పంచ్లకు ప్రభుత్వం కీలక అధికారాలు అప్పగించింది. ఇకపై అంగన్వాడీ కేంద్రాల పర్యవేక్షణ బాధ్యతలను పూర్తిగా సర్పంచ్లే చూసుకోనున్నారు. పౌష్టికాహారం పంపిణీలో జరుగు తున్న అక్రమాలను అరికట్టి, అంగ న్వాడీ కేంద్రాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. గతంలో రెండేళ్లపాటు గ్రామాల్లో ఎన్నికైన పాలకవర్గాలు లేకపోవడంతో




అంగన్వాడీ కేంద్రాల పర్యవేక్షణ పూర్తిగా గాడితప్పింది. చాలాచోట్ల పౌష్టికాహారం పక్కదారి పడుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో కొత్త పంచాయతీ పాలకవర్గాలకు ఈ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా సర్పంచ్ల నేతృత్వంలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయనుంది. ఈ కమిటీకి సర్పంచ్ ఛైర్మన్గా వ్యవహరించనుండగా, 11 మంది సభ్యులు ఉంటారు. అంగన్వాడీ టీచర్ కన్వీనర్గా, ఏఎన్ఎం, స్కూల్ సైన్స్ టీచర్, ఒక రిటైర్డ్ ఉద్యోగి, చిన్నారుల తల్లులు ఇందులో సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ సరుకుల నాణ్యతను, పంపిణీని తనిఖీ చేస్తుంది.

## రెండు రోజుల పాటు మద్యం దుకాణాలు బంద్

**దశ, హైదరాబాద్:** తెలంగాణ వ్యాప్తంగా రెండు రోజులపాటు మద్యం దుకాణాల బంద్‌కు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా శాంతిభద్రతల పరిరక్షణ, ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు వీలుగా అన్ని మున్సిపాలిటీల పరిధిలోని వైన్స్, బార్లను 2 రోజుల పాటు మూసివేయనున్నారు. ఫిబ్రవరి 9వ తేదీ సాయంత్రం 5 గంటల నుండి 11వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మద్యం అమ్మకాలను ఆ ప్రాంతాల్లో పూర్తిగా నిషేధించారు.అంతేకాకుండా, మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడే ఫిబ్రవరి 13వ తేదీన కూడా మద్యం దుకాణాలు మూసివేయాలని ఎన్నికల అధికారులు, ఆబ్కారీ శాఖ అధికారులు స్పష్టం చేశారు. ఈ నిబంధనలను అతిక్రమించి ఎవరైనా మద్యం విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఓటర్లను ప్రభావితం చేయకుండా, ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.




## పెరిగిన బంగారం, వెండి ధరలు

**దశ, హైదరాబాద్:** బంగారం, వెండి ధరలు మళ్లీ పెరిగాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,60,000, వెండి కిలో ధర రూ.2,70,000 వద్ద ఉన్నాయి. ఖరీదైన ఈ లోహాల ధరలు ఇటీవల భారీ దిద్దుబాటుకు గురయ్యాయి. బంగారం ధరలు రూ.1,80,000 నుంచి భారీగా పతనమై తర్వాత కాస్త కోలుకుంది. వెండి ధర అయితే దాదాపు సగం పతనమైంది. దీంతో కనిష్ఠాల వద్ద కొనుగోళ్ల మద్దతు లభిస్తోందని బులియన్ మార్కెట్ నిపుణులు అంటున్నారు.దీనికి ఇటీవల డాలర్ పతనం కావడం కూడా కారణమని చెబుతున్నారు. చైనా 15వ నెల కూడా పెద్ద మొత్తంలో బంగారాన్ని కొనుగోలు చేయడంతో డిమాండ్ బాగా పెరిగిందని అంటున్నారు. ఈ వారం వెలువడనున్న అమెరికా ఉద్యోగ, ద్రవ్యోల్బణ గణాంకాలు బంగారం, వెండి ధరలను ప్రభావితం చేస్తాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

## బీఆర్ఎస్‌కు మద్దతుగా మహిపాల్ రెడ్డి వ్యాఖ్యలు

**దశ, సంగారెడ్డి :** పఠాన్‌చెరు కాంగ్రెస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్మిక సంఘం నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే.. కొంతకాలంగా కాంగ్రెస్‌కు దూరంగా ఉంటున్న మహిపాల్ రెడ్డి, పార్టీపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి తమ నియోజకవర్గానికి ఎలాంటి ప్రయోజనాలు రాలేదన్న కారణంతో.. మహిపాల్ రెడ్డి అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ ఎన్నికల తర్వాత ఆయన అధికారికంగా బీఆర్ఎస్‌లో చేరతారని రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. గతంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మారిన మహిపాల్ రెడ్డి.. ప్రస్తుతం ఆ పార్టీపై విమర్శలు చేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## బీఆర్ఎస్‌కు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదు

### మున్సిపల్ ఎన్నికల వేళ సీఎం రేవంత్ ధ్వజం!



**దశ, హైద్రాబాద్:** తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం అధికారికంగా ముగిసిన నేపథ్యంలో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించి, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. పదేళ్ల పాటు అధికారంలో ఉండి మున్సిపాలిటీల అభివృద్ధిని పట్టించుకోలేదని బీఆర్ఎస్‌కు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని ఆయన ప్రశ్నించారు. ఈ సందర్భంగా సీఎం చేసిన కొన్ని వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. మున్సిపాలిటీల్లో ఉన్న అనేక సమస్యలకు బీఆర్ఎస్ పాలనే కారణమని సీఎం పేర్కొన్నారు. కీలక పదవులు కేసీఆర్ కుటుంబం చేతిలోనే ఉండగా, పదేళ్ల పాటు మున్సిపల్ పాలన కూడా బీఆర్ఎస్ ఆధీనంలోనే సాగిందన్నారు. ఇన్నేళ్లలో పేదలకు రేషన్ కార్డులు, ప్రాథమిక సాయం కూడా సరిగా అందలేదని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు నేపథ్యంలో వందల ఎకరాల భూముల కబ్జా ఆరోపణలను ప్రస్తావించిన రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్-బీజేపీ రెండూ ఒకటేనని, కేంద్ర బడ్జెట్ విషయంలో పరస్పరం మద్దతు ఇచ్చుకుంటున్నాయని ఆరోపించారు. బీజేపీ నాయకులు రాముడికంటే ఎక్కువగా ఓవైసీ పేరు ప్రస్తావిస్తారని, ఓవైసీని అల్లావుద్దీన్ అద్భుత దీపంలా ఉపయోగించుకుని ఓట్లు సాధిస్తున్నారని విమర్శించారు. బీజేపీకి అవసరమైనప్పుడు ఓవైసీ గుర్తుకొస్తారని, ఇది ప్రజలు గమనించాలన్నారు. కేంద్ర ప్రభుత్వంపై కూడా రేవంత్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇస్తామని ప్రధాని మోదీ ఇచ్చిన హామీని బీజేపీ విస్మరించిందని ఆరోపించారు. అలాగే మహారాష్ట్రతో సంబంధం ఉన్న మేడిగడ్డ అంశంలో తెలంగాణ రైతులకు తగిన న్యాయం జరగలేదని, ముంపు భూముల నష్టపరిహారం విషయంలో రాష్ట్రాన్ని మోసం చేశారని వ్యాఖ్యానించారు. బండి సంజయ్ ఇచ్చిన హామీలు అమలుకాకపోవడాన్ని ప్రస్తావిస్తూ, ఇప్పుడు కొత్తగా ఇచ్చే హామీలను ప్రజలు ఎలా నమ్మాలని ప్రశ్నించారు. కేంద్ర మంత్రులు లక్షల కోట్ల నిధులు ఇచ్చామని చెబుతున్నా, అవి పన్నుల వాటాలో భాగమేనని, అందులోనూ దక్షిణ రాష్ట్రాలకు తీవ్ర వివక్ష జరుగుతోందని విమర్శించారు. ఈ విషయాలపై కేంద్ర మంత్రులు ప్రధాని మోదీని ఎందుకు ప్రశ్నించడంలేదని నిలదీశారు. ఈ ఎన్నికల్లో ప్రజలు వాస్తవాలను గమనించి సరైన నిర్ణయం తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## కోట్లు కురిపిస్తున్న మేడారం హుండీలు..

### 11.83 కోట్ల ఆదాయం

**మేడారం:** ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన మేడారం సమ్మక్కసారలమ్మ మహాజాతర ఇటీవల పూర్తయిన సంగతి తెలిసిందే. దాదాపు రెండున్నర కోట్ల మంది భక్తులు వచ్చి.. అమ్మవార్లను దర్శించుకున్నట్లు తెలంగాణ ప్రభుత్వం వెల్లడించింది. ఇక మేడారంలో ఏర్పాటు చేసిన హుండీలను హనుమకొండకు తీసుకువచ్చి.. టీటీడీ కల్యాణ మండపంలో గత గురువారం రోజున లెక్కింపు ప్రక్రియను రాష్ట్ర దేవాదాయ శాఖ అధికారులు ప్రారంభించారు. ఇవాళ్టికి గత 5 రోజులుగా హుండీలను లెక్కించే పనిలో దేవాదాయ శాఖ సిబ్బంది తలమునకలై ఉన్నారు. ఇక ఐదోరోజు 163 హుండీలను లెక్కించిన అధికారులు ఇప్పటివరకు వచ్చిన ఆదాయం వివరాలను వెల్లడించారు. ఇవాళ ఒక్కరోజే మొత్తం రూ.1.12 కోట్ల ఆదాయం సమకూరినట్లు తెలిపారు.


### ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ ప్రమాదం..

## అన్నీ అనుమానాలే




**దశ, హైదరాబాద్:** హైదరాబాద్‌లోని స్టేట్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ లో జరిగిన అగ్నిప్రమాదం సంచలనంగా మారింది. ఈ ప్రమాదంలో ముఖ్యంగా కంప్యూటర్ ల్యాబ్ విభాగం పూర్తిగా దగ్ధమవ్వడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర రాజకీయాలను కుదిపేసిన ఫోన్ ట్యాపింగ్, గతంలో ప్రకంపనలు సృష్టించిన ఓటుకు నోటు కేసులకు సంబంధించిన అత్యంత కీలకమైన డిజిటల్ సాక్ష్యాలు, ఆడియో రికార్డింగ్‌లు ఈ ల్యాబ్‌లోనే ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ కీలక సాక్ష్యాలన్నీ కాలిపోయాయన్న ప్రచారం జరుగుతోంది. పోలీసులు ధృవీకరించడం లేదు కానీ.. కీలక కేసుల సాక్ష్యాలు కాలిపోయాయని చెబుతున్నారు. ముఖ్యంగా ఫోన్ ట్యాపింగ్ కేసులో స్వాధీనం చేసుకున్న హార్డ్ డిస్క్‌లు, నిందితుల నుంచి సేకరించిన ఎలక్ట్రానిక్ పరికరాల విశ్లేషణ ప్రక్రియ ప్రస్తుతం ఈ ల్యాబ్‌లోనే కొనసాగుతోంది. అలాగే, ఓటుకు నోటు కేసులో కీలకమైన వాయిస్ శాంపిల్స్ నివేదికలు కూడా ఇక్కడే భద్రపరిచినట్లు సమాచారం. అకస్మాత్తుగా కంప్యూటర్ ల్యాబ్‌లోనే మంటలు చెలరేగడం, ఇతర విభాగాల కంటే డేటా సెంటర్ ఉన్న ప్రాంతంలోనే నష్టం ఎక్కువగా జరగడంతో.. సాక్ష్యాలను రూపుమాపడానికి ఎవరైనా కావాలనే ఈ ప్రమాదానికి పాల్పడ్డారా? అనే కుట్ర కోణం పై పోలీసులు లోతుగా విచారిస్తున్నారుసాక్ష్యాలు బుగ్గిపాలు కావడం వల్ల ఈ ప్రతిష్టాత్మక కేసుల విచారణ గందరగోళంలో పడే అవకాశం ఉంది.

# ముక్కోణపు భాగ్యనగరం




**మొదటి పేజీ తరువాయి**

రమారమి కోటి మంది జనాభా ఉండేది. ప్రస్తుత జీహెచ్ఎంసీ పరిధిలో 1.34కోట్ల మంది జనాభా ఉంది. అప్పుడు 150 డివిజన్లు ఉండగా డివిజన్ల పునర్విభజనలో భాగంగా అవి 253కు పెరిగాయి. పాత నగరంలో జనాభా అధికంగా ఉన్నందువల్ల డివిజన్ల సంఖ్య దాదాపు రెట్టింపయినట్లుగా అధికారులు వివరిస్తున్నారు. గ్రేటర్ పరిధిలో విలీనమైన 27 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో జనాభా అంతంతమాత్రమే. పాత గ్రేటర్ హైదరాబాద్తో పోలిస్తే ఆయా స్థానిక సంస్థలు రెట్టింపు విస్తీర్ణంలో ఉన్నాయి. జనాభా మాత్రం 30లక్షలే. వాటి పరిధిలో 47 డివిజన్లు ఏర్పాటయ్యాయి.గతేడాది డిసెంబరు 3వ తేదీన జీహెచ్ఎంసీ 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 డివిజన్లతో అతిపెద్ద నగరపాలక సంస్థగా ఆవిర్భవించింది. ప్రస్తుత జీహెచ్ఎంసీని 70లక్షల జనాభాతో కూడిన 6 జోన్లకు పరిమితం చేసి సగటున 35 లక్షల జనాభా ఉండేవిధంగా మల్కాజిగిరి, సైబరాబాద్ కార్పొరేషన్లను 3 జోన్ల చొప్పున ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశం.

రాజధాని హైదరాబాద్ నగర అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం పలు చర్యలు చేపట్టిన విషయం విదితమే. దీనిలో భాగంగానే బాహ్యావలయ రహదారి(ఓఆర్ఆర్) పరిధిలో ఉన్న 27 పురపాలికలను గ్రేటర్ హైదరాబాద్మున్సిపల్ కార్పొరేషన్లో విలీనం చేసింది. దాంతో ఓ దశలో జీహెచ్ఎంసీ దేశంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్ కానుందనే ప్రచారం జరిగింది. కానీ, పరిపాలనా సౌలభ్యం కోసం దీన్ని మూడు కార్పొరేషన్లుగా విభజించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పరిపాలన సజావుగా సాగేందుకు హైదరాబాద్ పరిధిలో పోలీసు, పురపాలక శాఖల సరిహద్దులు ఒకేవిధంగా ఉండేలా చూడాలని తెలంగాణ ప్రభుత్వం యోచిస్తోంది. ఇటీవలే రాజధాని పరిధిలోని హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లను పునర్వ్యవస్థీకరించింది. హైదరాబాద్ పరిధిని పెంచడంతో పాటు రాచకొండను మల్కాజిగిరిగా మార్చనున్నట్లుగా సమాచారం.

## మున్సిపల్స్‌కు అంతా సిద్ధం

**మొదటి పేజీ తరువాయి**

సాయంత్రం 5 గంటలకు అధికారికంగా ప్రచారం ముగించాలి. ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు చేపట్టి విజేతలను ప్రకటిస్తారు. ఈ ఎన్నికలలో మొత్తం 52.43 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇటీవల గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగగా మెజార్టీ స్థానలను అధికార కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ కు గట్టి పోటీ ఇవ్వాలని బీఆర్ఎస్, బీజేపీ భావిస్తున్నాయి.తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో సామాజిక న్యాయం పాటించేలా కాంగ్రెస్ ప్రభుత్వం, పురపాలక శాఖ రిజర్వేషన్లను ఖరారు చేశాయి. మొత్తం వార్డులలో 50 శాతం స్థానాలను మహిళలకు కేటాయించడం ఈ రిజర్వేషన్లలో అత్యంత కీలకమైన అంశం. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను వారి జనాభా ప్రాతిపదికన నిర్ణయించగా, బీసీలకు 34 శాతానికి మించకుండా రిజర్వేషన్లు కల్పించారు. మున్సిపల్ చైర్మన్, మేయర్ పదవులకు సంబంధించి కూడా ఇదే నిష్పత్తిని పాటిస్తూ లాటరీ పద్ధతి ద్వారా రిజర్వేషన్లను ఖరారు చేశారు.వార్డుల విభజన, ఓటర్ల జాబితా ఆధారంగా ఏయే వార్డు ఏ వర్గానికి కేటాయించారో ఇప్పటికే జిల్లా గెజిట్లలో ప్రచురించారు. బీసీ రిజర్వేషన్ల కోసం ప్రత్యేకంగా కుల గణన డేటాను కూడా ప్రామాణికంగా తీసుకున్నారు.

### విద్యాసంస్థల మూసివేత

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యాసంస్థలకు ఆ రోజున సెలవు ప్రకటించాలని ఎస్ఈసీ స్పష్టం చేసింది. చాలా విద్యాసంస్థలను పోలింగ్ కేంద్రాలుగా వినియోగిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

### ప్రైవేట్ కంపెనీలకు సూచన

సాఫ్ట్‌వేర్ సంస్థలు, షాపింగ్ మాల్స్, ఇతర ప్రైవేట్ పరిశ్రమలలో పనిచేసే సిబ్బందికి కూడా ఓటు వేయడానికి వెసులుబాటు కల్పించాలని, అవసరమైతే వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని ఎన్నికల సంఘం సూచించింది.

### కలెక్టర్లకు పర్యవేక్షణ బాధ్యతలు

ప్రతి జిల్లాలో సెలవు ప్రకటన అమలును జిల్లా కలెక్టర్లు పర్యవేక్షించాల్సి ఉంటుంది ఓటర్లు తమ ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చేలా అవగాహన కల్పించాలని ఎస్ఈసీ ఆదేశించింది.నిబంధనల ఉల్లంఘన: సెలవు ప్రకటించకుండా సిబ్బందిని విధులకు హాజరుకావాలని ఒత్తిడి చేసే సంస్థలపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు.పోలింగ్ శాతం పెంచడం, ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి పౌరుడిని భాగస్వామిని చేయడమే లక్ష్యంగా ఈ సెలవును ప్రకటించారు.

# ‘టైర్ టూ’ సిటీస్ లో రియల్ ఎస్టేట్ బూమ్

### అపార్ట్‌మెంట్ల కంటే ఓపెన్ ప్లాట్లపై పెట్టుబడి

**దశ, హైదరాబాద్:** తెలంగాణ , ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన టైర్2 నగరాల్లో రియల్ ఎస్టేట్ రంగం అనూహ్యమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వరంగల్, కరీంనగర్, తిరుపతి వంటి నగరాల్లో ఓపెన్ ప్లాట్ల వ్యాపారం గత ఏడాదితో పోలిస్తే ఏకంగా 15 శాతం వృద్ధిని నమోదు చేసింది. హైదరాబాద్ వంటి మెట్రో నగరాల్లో ధరలు సామాన్యులకు అందుబాటులో లేకపోవడం, ఐటీ , పారిశ్రామిక రంగాలు ద్వితీయ శ్రేణి నగరాలకు విస్తరిస్తుండటంతో పెట్టుబడిదారులు ఇప్పుడు ఈ ప్రాంతాల వైపు మొగ్గు చూపుతున్నారు.ముఖ్యంగా మధ్యతరగతి వర్గాల వారు భవిష్యత్తు అవసరాల కోసం ఈ నగరాల శివార్లలో ప్లాట్లు కొనడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. తెలంగాణలో హైదరాబాద్ తర్వాత అతిపెద్ద నగరంగా ఎదుగుతున్న వరంగల్‌లో రియల్ ఎస్టేట్ బూమ్ కనిపిస్తోంది. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ,వరంగల్ ఎయిర్‌పోర్ట్ పునరుద్ధరణ వార్తలు ఇక్కడి భూముల ధరలకు రెక్కలు తెచ్చాయి. కరీంనగర్‌లో ఐటీ టవర్లు, పర్యాటక రంగ అభివృద్ధి వల్ల పట్టణ సరిహద్దులు వేగంగా విస్తరిస్తున్నాయి. గతంలో కేవలం వ్యవసాయ భూములుగా ఉన్న ప్రాంతాలు నేడు డీటీసీపీ అనుమతి పొందిన లేఅవుట్లుగా మారుతున్నాయి. ఇక్కడ గత ఏడాదితో పోలిస్తే ప్లాట్ల అమ్మకాల్లో సుమారు 14 నుంచి 16 శాతం వరకు ధరల పెరుగుదల కనిపించడం గమనార్హం. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో కూడా ఇదే విధమైన ట్రెండ్ కొనసాగుతోంది. ప్రపంచ ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రం కావడంతో పాటు, అక్కడ



ఏర్పాటవుతున్న కొత్త టౌన్‌షిప్‌లు ,పారిశ్రామిక కారిడార్లు రియల్ ఎస్టేట్ వృద్ధికి ప్రధాన కారణమయ్యాయి. తిరుపతిమదనపల్లి , తిరుపతి చెన్నై హైవేల వెంట వెలుస్తున్న ఓపెన్ ప్లాట్ వెంచర్లకు డిమాండ్ భారీగా పెరిగింది.ఈ నగరాల్లో 15 శాతం వృద్ధి నమోదు కావడానికి మెరుగైన కనెక్టివిటీ ప్రధాన కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. కొత్తగా నిర్మిస్తున్న బైపాస్ రోడ్లు, అండర్ పాస్లు ,మెరుగైన డ్రైనేజీ వ్యవస్థలు పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని పెంచాయి. అపార్ట్‌మెంట్ల కంటే ఓపెన్ ప్లాట్లపై పెట్టుబడి పెడితే తక్కువ కాలంలోనే ఎక్కువ లాభం వస్తుందని భావించడం కూడా ఈ రంగం పుంజుకోవడానికి కారణం.

# పోటీలోనూ.. ఆమెదే రాజ్యం...



### 50 శాతానికి మించి బరిలో మహిళలు

**దశ, హైదరాబాద్:** తెలంగాణలో మరోసారి ఎన్నికల సందడి మొదలైంది. రాష్ట్రంలో 11వ తేదీన జరగనున్న ఏడు నగర పాలక సంస్థలు, 116 పురపాలక సంఘాల ఎన్నికల్లో మొత్తం 12,944(ఏకగ్రీవాలతో కలిపి) మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. పురపాలక ఎన్నికల్లో పురుష అభ్యర్థుల కంటే మహిళలే అధికంగా ఉన్నారు. మొత్తం పోటీదారుల్లో 6,508 మంది (50.27శాతం) మహిళా అభ్యర్థులు ఉన్నారు. పురుష అభ్యర్థులు 6,436 (49.73 శాతం) మంది. నగరపాలికల్లో అత్యధికంగా కరీంనగర్‌లో 66 డివిజన్లకు 398 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. పురపాలికల్లో ఆదిలాబాద్‌లో అత్యధికంగా 49 వార్డులకు 314 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అత్యల్పంగా కొడంగల్ మున్సిపాలిటీలో 12 వార్డులకు 34 మంది మాత్రమే ఎన్నికల బరిలో నిలిచారు. నగరపాలికల పరంగా పరిశీలిస్తే మహబూబ్‌నగర్‌లో అత్యధికంగా 127 మంది ఇండిపెండెంట్ అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. పురపాలికల్లో ఆదిలాబాద్‌లో 93 మంది పోటీలో నిలిచారు. ఈ మేరకు అభ్యర్థుల జాబితాను తెలంగాణ ఎన్నికల సంఘం విడుదల చేసింది.పార్టీల వారీగా పోటీ చేసే స్థానాలు : రాష్ట్రవ్యాప్తంగా ఏ పార్టీ ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తోందనే వివరాలను కాంగ్రెస్ పార్టీ విడుదల చేసింది. 2,948 (98.3 శాతం) స్థానాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ పోటీచేస్తోంది. భారత రాష్ట్రసమితి 2,878 స్థానాల్లో (96 శాతం), బీజేపీ 2,634 (87.3 శాతం), ఇండిపెండెంట్ అభ్యర్థులు 2,786 (94 శాతం), జనసేన పార్టీ 332 స్థానాల్లో (11.1 శాతం), మజ్లిస్ 282 (9.4శాతం), ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ 288 (11.1శాతం), బీఎస్పీ 213 (7.1శాతం), సీపీఐ 168 (5.6 శాతం), సీపీఎం 108 (4.2శాతం), ఆప్ 38 (1.2 శాతం), ఐయూఎంఎల్ 9 (0.3శాతం) స్థానాలకు పోటీ చేస్తున్నాయి.

**కార్పొరేషన్లు, పురపాలికలవారీగా :**

ఏడు కార్పొరేషన్ల పరిధిలో 414 డివిజన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 2,225 మంది ఎన్నికల బరిలో ఉన్నారు. పురపాలికల వారీగా చూస్తే 116లో 10,719 మంది పోటీ చేస్తున్నారు.

**అభ్యర్థుల విద్యార్హతలు :**

నగర, పురపాలక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే వారిలో కొంతమంది నిరక్షరాస్యులున్నారు. ఆ వివరాలు ఇవే.. విద్యార్హత సంఖ్య పోస్టు గ్రాడ్యుయేట్లు 775, గ్రాడ్యుయేట్లు 2,903, అండర్ గ్రాడ్యుయేట్లు 7,917, నిరక్షరాస్యులు 1,291, : నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీల ఎన్నికల్లో 14 మంది ఏకగ్రీవమైనట్లుగా ఎస్ఈసీ( రాష్ట్ర ఎన్నికల సంఘం) ప్రకటించింది. ఇందులో ఇద్దరు నగరపాలికల పరిధిలోని వారు కాగా 12 మంది పురపాలికల్లోని అభ్యర్థులు. మొత్తం 14లో 12 మంది అధికార కాంగ్రెస్ అభ్యర్థులు కాగా ఇద్దరు బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారని ఎస్ఈసీ పేర్కొంది.హస్తం పార్టీకి రెండు డివిజన్లు ఏకగ్రీవమయ్యాయి. మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌లోని 58వ డివిజన్‌లో రమాదేవి, రామగుండం కార్పొరేషన్‌లోని ఒకటో డివిజన్‌లో మాడిపల్లి విజయలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.పలుచోట్ల పురపాలికల్లో అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ వివరాలను రాష్ట్ర ఎన్నికల సంఘం(ఎస్ఈసీ) ప్రకటించింది. కాంగ్రెస్ పార్టీ తరఫున చౌటుప్పల్‌లో చింత ఉమామహేశ్వరి అనే అభ్యర్థి (17వవార్డు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హాలియాలో పిల్లి చంద్రకళ(10), ఎదులాపురంలో తమ్మినేని మంగతాయి(15), హుజూర్‌నగర్‌లో నాగలక్ష్మి(3), కోదాడలో దేవరపల్లి మల్లేశ్వరి(11), వై.కుసుమకుమారి(31), కట్టెబోయిన జ్యోతి(21), మెదక్‌లో గొడల మానస(32), వికారాబాద్‌లో అనంతరెడ్డి(1), యాదగిరిగుట్టలో గుండిపల్లి వాణి (10) లు ఎన్నిక ఏకగ్రీవమైంది. బీఆర్ఎస్ తరఫున అలంపూర్‌లో విక్రం(10), వికారాబాద్‌లో విజయలక్ష్మి (15వ వార్డు) ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు ఎస్ఈసీ వెల్లడించింది.

## హరీష్ రావును కరీంనగర్ తరిమికొట్టేదాక వదలను



**దశ, గజ్వేల్:** మాజీ మంత్రి హరీష్ రావుపై మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఘాటు వ్యాఖ్యలు చేశారు.హరీష్ రావును కరీంనగర్ తరిమికొట్టేదాక వదలను అంటూ హెచ్చరించారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత ఎంతమంది వస్తారో రండి, నేనొక్కడినే వస్తా... తేల్చుకుందాం అంటూ సవాల్ విసిరారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఇందిరమ్మ చౌరస్తాలో నిర్వహించిన బీజేపీ ఎన్నికల ప్రచార సభలో రఘునందన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,కేసీఆర్ బిడ్డ వాళ్ల నాన్న కేసీఆర్‌ను అడిగి ‘ఏం పీకి కట్టలు కట్టడానికి దేశం మీదకు పోదాం అన్నారంటూ వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ బొమ్మ సాక్షిగా చెబుతున్నానని పేర్కొన్న రఘునందన్ రావు,హరీష్ రావుకు సిద్దిపేట, గజ్వేల్‌తో ఏమి సంబంధం? రాష్ట్రంలో 610 జీవో అమలు జరగాలి. హరీష్ రావు కరీంనగర్‌కు వెళ్లాలి అని డిమాండ్ చేశారు .తనపై వ్యక్తిగత విమర్శలకు స్పందించిన ఆయన,నేను పాలిటెక్నిక్ సాధువుకున్నవాడిని కాదు, ప్రభాకర్ రెడ్డి లాగా బస్ డ్రైవర్‌ని కూడా కాదు. విజ్ఞత కలిగిన వ్యక్తిని అంటూ వ్యాఖ్యానించారు. అలాగే గజ్వేల్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రజలు నమ్మి ఓట్లు వేసినా ఒక్కసారైనా మీ బాధలు చూడడానికి కేసీఆర్ వచ్చారా అంటూ ప్రశ్నించారు.

## 16న కురవి శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో మహా అన్నప్రసాద వితరణ

**దశ, హైదరాబాద్:** కురవి భద్రకాళి సమేత వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 16వ తేదీన సోమవారం మహా అన్నప్రసాద వితరణ ఉంటుందని శ్రీ వీరభద్రస్వామి సేవా సమితి అధ్యక్షుడు షాబాద్ వెంకటేశం, ప్రధానకార్యదర్శి కాసుల వినోద్ తెలిపారు. శ్రీ వీరభద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ నుంచి మార్చి 1వ తేదీ వరకు శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయని ఉత్సవ కమిటి చైర్మన్ కూర రవీందర్ రెడ్డి, ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారి సత్యనారాయణ తెలిపారు. అన్న ప్రసాద వితరణ ఏర్పాట్లపై సోమవారం శ్రీ వీరభద్రస్వామి సేవా సమితి ప్రతినిధులు డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే జె.రాంచందర్ నాయక్, ఉత్సవ కమిటీ చైర్మన్ కూర రవీందర్ రెడ్డి, ఆలయ ఈఓ సత్యనారాయణ, మాజీ జడ్పిటీసీ అంబటి వీరభద్రం, ఉత్సవ కమిటీ సభ్యులు కాసుల మల్లికార్జున్, ఆలయ మాజీ చైర్మన్ మేకల దామోదర్ రెడ్డి, కురవి ఎంపిడిఓ వీరబాబు, కురవి గ్రామ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ విజయలక్ష్మి, తదితర అధికారులను, ప్రజా ప్రతినిధులను, కలిసి చర్చించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 4వేల మందికి పైగా అన్న ప్రసాద వితరణ ఏర్పాట్లు చేయనున్నట్లు కాసుల వినోద్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ వీరభద్రస్వామి సేవా సమితి ప్రతినిధులు మహబూబాబాద్ జిల్లా కురవి లోని కురవి శ్రీ వీరభద్ర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సేవా సమితి ప్రధాన కార్యదర్శి కాసుల వినోద్, ఉత్సవ కమిటీ సభ్యులు, సేవా సమితి ఉపాధ్యక్షులు కాసుల మల్లికార్జున్, మార్గం విజయ్ పటేల్, మించు ఆనంద్ రావు, నర్రా సాయికిరణ్, ఎం. విష్ణువర్ధన్ రావు తదితరులు పాల్గొన్నారు.



### సైబర్ నేరగాళ్ల వేధింపులతో..
## వ్యక్తి ఆత్మహత్య

**దశ, ములుగు :** సైబర్ నేరగాళ్ల వేధింపులు ఒక నిండు ప్రాణాన్ని బలిగొన్నాయి. మూడు రోజులుగా సాగుతున్న మానసిక వేధింపులను తట్టుకోలేక ములుగు జిల్లా వెంకటాపురం మండలం తిప్పాపురం గ్రామానికి చెందిన కోరం రామారావు అనే వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డారు. మృతుడు రామారావు రాసిన సూసైడ్ నోట్ ప్రకారం, సైబర్ నేరగాళ్లు ఆయన ఫోన్‌ను హ్యాక్ చేశారు. గత మూడు రోజులుగా నిరంతరం ఫోన్ చేస్తూ, మానసిక ఒత్తిడికి గురిచేస్తూ వేధింపులకు పాల్పడ్డారు. ఈ వేధింపులు భరించలేక రామారావు గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆయన్ను ఆస్పత్రికి తరలించి చికిత్స అందించినప్పటికీ.. పరిస్థితి విషమించడంతో రామారావు మృతి చెందారు. చనిపోయే ముందు రామారావు రాసిన నోటు ఇప్పుడు కలకలం రేపుతోంది. తన వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలించి, ఫోన్ హ్యాక్ చేసి వేధిస్తున్నట్లు పేర్కొన్నారు. తన ప్రాణం పోవడానికి కారణమైన సైబర్ నేరగాళ్లపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆవేదనతో నోటులో కోరారు. రామారావు మృతితో తిప్పాపురం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## రూ.5 వేల కోట్ల
### భారీ ఆన్‌లైన్ గేమింగ్ స్కామ్

**దశ, హైదరాబాద్:** నగరంలో భారీ ఆన్‌లైన్ గేమింగ్ స్కామ్ గుట్టును పోలీసులు రట్టు చేశారు. దుబాయ్ కేంద్రంగా ఆన్‌లైన్ గేమింగ్ స్కామ్ జరిగినట్లు ప్రాథమిక విచారణలో బయటపడింది. డొల్ల కంపెనీలకు రూ.5వేల కోట్లు మళ్లించినట్టు గుర్తించారు. ఫిన్‌టెక్ ప్లాట్‌ఫామ్‌లు, రెంటెడ్ బ్యాంక్ అకౌంట్ల ద్వారా ఈ అక్రమ లావాదేవీలు జరిగినట్లు తెలుస్తోంది. జీఎస్టీ ఎగవేతకు ఎస్క్రో ఖాతాలను దుర్వినియోగం చేసినట్టు పోలీసులు గుర్తించారు. ఫిన్‌టెక్ సంస్థలు, రేస్‌జీఈటీ247 వంటి వెబ్‌సైట్ల ద్వారా అక్రమ దందా నడిచినట్లు బయటపడింది. బ్యాంకింగ్ ఏపీఐలను అక్రమంగా ఉపయోగించి, ఆడిట్‌కు దొరక్కుండా నిందితులు జాగ్రత్త పడ్డారని పోలీసులు తెలిపారు. రియల్ మనీ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా భారీ మొత్తాలు షెల్ కంపెనీలకు మళ్లించినట్టు విచారణలో వెల్లడైంది. ఈ స్కామ్‌లో కీలక నిందితులుగా ఉన్న ‘విగోఫిన్ డిజిటల్ సొల్యూషన్స్’ డైరెక్టర్లు వైఎస్ ప్రభుకుమార్, రాజశేఖర్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం వీరిద్దరినీ పోలీసులు విచారిస్తున్నారు. విచారణలో ఈ స్కామ్‌కు సంబంధించి మరిన్ని కీలక విషయాలు బయటకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com